క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

డిండి: మండల పరిధిలో ఏని చెర్కుపల్లి, టి.గౌరారం, దేవత్‌పల్లితండా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో అవసరమైన మార్పులు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ తిర్పతయ్య, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామ్ నాయక్ తదితరులున్నారు.

మండల అభివృద్ధికి కృషి



బోరుమోటారును ప్రారంభిస్తున్న శోభారాణి

పెద్దఅడిశర్లపల్లి: మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్, జెడ్పీటీసీ అలుగుబెల్లి శోభారాణి అన్నారు. శనివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని నంభాపురం, ఎల్లాపురం, పెద్దగట్టు, బూడిదగట్టు గ్రామాల్లో రూ.10 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఏవిరెడ్డి, నారాయణ, మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ పత్తి, వెంకట్రావు, ఎల్లయ్యయాదవ్, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, బోడ్యానాయక్, .ధర్మారెడ్డి, సతీష్‌రెడ్డి, చంద్రారెడ్డి, పాండునాయక్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో వసతులు కల్పిస్తాం



వసతులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో కొత్తగా ప్రారంభించిన మైనార్టీ గురుకుల కళాశాలలో అన్ని వసతులు కల్పిస్తామని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకుల కళాశాలలో వసతులు పరిశీలించారు. కళాశాల ఆవరణలోని చెడిపోయిన చేతిపంపును రిపేరు చేయించడంతోపాటు, కొత్తగా బోరు మోటారు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలె రాములమ్మ రామచంద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, ప్రిన్సిపాల్ ఎండీ ఫారూఖ్, వార్డెన్ షేక్ సయ్యద్‌మియా, నాయకులు పురం వేణు, కామెళ్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీకి సహకరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నాగార్జునసాగర్: నందికొండను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కర్ణ అనూషాశరత్‌రెడ్డి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పైలాన్‌కాలనీలోని 12వ వార్డులో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, మున్సిపాలిటీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పులిచర్లను మండలం చేయాలని వినతి

పెద్దవూర: మండలంలోని పులిచర్ల గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవసాని శ్రీనివాస్‌రెడ్డి శనివారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన చాంబర్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులిచర్లను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే పెద్దవూర, పెదఅడిశర్లపల్లి మండలాల్లోని 12 గ్రామ పంచాయతీలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కొండమల్లేపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆలిండియా స్టూడెంట్ సోషల్ సర్వీస్ (ఏఐఎస్ఎస్) అధ్యక్షుడు రమావత్ సేవానాయక్, మెడికల్ ఆఫీసర్ ఉషారాణి అన్నారు. ఏఐఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కొండమల్లేపల్లి పీహెచ్‌సీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమన్‌రెడ్డి, నాయకులు యేకుల సురేష్, వైద్య సిబ్బంది మహమ్మద్ రఫిక్, మహమూద్ హలీం, చారి, కవిత, నిత్య తదితరులు పాల్గొన్నారు.

జీవాలతో జీవన పోరాటం!

- మేత కోసం జీవాలను తోలుకువస్తున్న పాలమూరు గొర్రెల కాపరులు
- ఏడాదిలో ఎనిమిది నెలలు సాగర్ ఆయకట్టు ప్రాంతంలోనే..
- జీవాలకు బీమాలేక నష్టపోతున్నామని ఆవేదన



తిరుమలగిరి ప్రాంతం మీదుగా గొర్రెల మందను తోలుకెళ్తున్న పాలమూరు వాసులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పాలమూరు గొర్రెల కాపరులు బహుదూరపు బాటసారులు. ఏడాదిలో ఎనిమిది నెలల పాటు తమ ప్రాంతాన్ని వదిలి ఇక్కడే ఉంటూ జీవన పోరాటం సాగిస్తారు. పాలమూరు ఎక్కువ శాతం నాన్‌ఆయకట్టు ప్రాంతం కావడంతో అక్కడ జీవాలకు మేత కరువు. దీంతో మేత కోసం గొర్రెల కాపరులు వివిధ జిల్లాలు తిరుగుతుంటారు. నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతం కావడం, జీవాలకు కావాల్సిన మేత ఉండటంతో ప్రతి సంవత్సరం మేతకోసం ఈ ప్రాంతానికే వస్తుంటారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఒకప్పుడు కరువుతో కొట్టుమిట్టాడుతుండేది. దీంతో మూగజీవాలను బతికించుకునేందుకు గొర్రెల కాపరులు నానా తంటాలు పడేవారు. ఈ క్రమంలోనే వారు అప్పటి నుంచి జీవాల మేత కోసం ఇక్కడికి వస్తున్నారు. ప్రతి సంవత్సరం జూన్‌లో ఇళ్లను వీడి బృందాలుగా ఏర్పడి మందలతో బయలు దేరుతారు. మరలా ఉగాది సమయంలో వారి మందలను తోలుకొని ఇంటికి చేరుకుంటారు.

వందల సంఖ్యలో గొర్రెలు..

ఇతర ప్రాంతాల కంటే ఎక్కువగా గొర్రెలను ఎక్కువగా పాలమూరులోనే పెంచుతుంటారు. ఒక్కో గొర్రె కాపరికి వెయ్యి నుంచి పదిహేను వందల గొర్రెల వరకు ఉంటాయి. సుమారుగా 20వేలకు పైగా గొర్రెలు ప్రతి సంవత్సరం ఈ ప్రాంతానికి తీసుకువస్తుంటారు. సేంద్రియ ఎరువు భూమికి అవసరం కాగా ఇక్కడి రైతులు గొర్రెల మందలను వారి పొలాల్లో ఉంచుకొని ఒక్కో రాత్రికి రూ.2వేల చొప్పున గొర్రెల కాపరులకు చెల్లిస్తారు.

తరుచూ ప్రమాదాలు..

రోడ్డుమార్గాన సాగుతున్న వీరి ప్రయాణంలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ఘటనలో జీవాలు చనిపోతుంటాయి. బీమా లేకపోవడంతో కాపరులు నష్టపోతున్నారు. పశుసంవర్ధక శాఖ అవగాహన కల్పించకపోవడంతో గొర్రెల కాపరులు జీవాలకు బీమా చేయించడం లేదు.

ప్రతి సంవత్సరం వస్తుంటాం



మాది నాన్‌ఆయకట్టు ప్రాంతం కావడంతో మా ప్రాంతంలో జీవాలకు మేత దొరకదు. గత పది సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం మేము ఇక్కడికి వస్తున్నాం. దూరప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ అడవుల్లో ఉండటం ఇబ్బందిగా ఉన్నా మా కుల వృత్తి కావడంతో వదులుకోలేకపోతున్నాం.

– రాజు, గొర్రెల కాపరి, మహబూబ్‌నగర్

మూడు నెలలే ఇంటి వద్ద..



సంవత్సరంలో ఎనిమిది, తొమ్మిది నెలలు బయట ప్రాంతాల్లోనే నివసిస్తాం. మూడు నెలలు మాత్రమే ఇంటి వద్ద ఉంటాం. మా ప్రాంతం నుంచి ఇక్కడికి సుమారు 20 నుంచి 30 మందలు వస్తాయి. మందలు వేరైనా అందరం కలిసిమెలసి ఉంటాం.

– నాగరాజు, గొర్రెల కాపరి, మహబూబ్‌నగర్ జిల్లా

పంట రుణమాఫీ పత్రాల పంపిణీ



రుణమాఫీ పత్రాలు పంపిణీ చేస్తున్న డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్

మిర్యాలగూడ: రైతులకు దీర్ఘకాలిక, పంట రుణాల మాఫీ పత్రాలను పంపిణీ చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్ అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలంలోని పీఏసీఎస్ కేంద్రంలో 62 మందికి రైతులకు రూ.36.12లక్షల రుణమాఫీ పత్రాలు, రూ.30లక్షల దీర్ఘకాలిక రుణాలు, కొత్తగా 40 మందికి రూ.22.96లక్షల పంట రుణాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో రూ.36లక్షల విలువగల ఎరువులు, విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మచ్చ లచ్చయ్య, డైరెక్టర్లు చిమట వెంకట్రామయ్య, పల్నాటి జానకిరెడ్డి, గుగులోతు నాగరాజు, మోదాల చంద్రకళ, రైతులు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి దళితబంధు ఇవ్వాలి



రిలే దీక్ష చేస్తున్న దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు

దేవరకొండ: రాజకీయ ప్రమేయం లేకుండా ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు ఇవ్వాలని దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లా వెంకటయ్య, కొండ్రపల్లి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం దేవరకొండ పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలో వారు మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద రూ.5లక్షల సాయం అందించాలన్నారు. దీక్షకు బీజేపీ నాయకులు అంకూరి నర్సింహ, వస్కుల సుధాకర్, ఆంజనేయులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పొట్ట ఇద్దయ్య, రాజు, మాతంగి శ్రీను, పొట్ట మురళి, పొట్ట రత్నయ్య, ఎర్ర ఆంజనేయులు, పొట్టిపాక మురళి తదితరులున్నారు.

ఆశావర్కర్లకు రూ.18వేల వేతనమివ్వాలి



దేవరకొండలో ఆశా వర్కర్ల మానవహారం

దేవరకొండ : ఆశావర్కర్లకు ప్రభుత్వం రూ.18వేల వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్లా వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాగరాజు, బిజిలి లింగయ్య, ఆశా వర్కర్లు ఉన్నారు.

కొనసాగుతున్న ఆశాల సమ్మె

పెద్దవూర: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పెద్దవూర మండల కేంద్రంలోని జడ్చర్ల– కోదాడ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రయ్య, ఆశావర్కర్లు వెంకటమ్మ, జయమ్మ, కృష్ణవేణి, మరియమ్మ, శోభారాణి, జ్యోతి, గౌసియా, సక్కుబాయి, లక్ష్మమ్మ, నాగమణి, రాణి, సంపూర్ణ, పద్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను చర్చలకు పిలవాలి



మాట్లాడుతున్న బాలునాయక్

కొండమల్లేపల్లి: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి, వారి సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నండూరి కరుణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లిలో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మెలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, కోట్ల శోభ, విజయలక్ష్మి, పార్వతి, జ్యోతి, సుశీల, నిర్మల, నాగమణి, నీలా, పద్మ, జయంతి, సుజాత, బేబి, అంబాలి, అనిత, అలివేలు మంగ, వెంకటమ్మ, బుచ్చమ్మ, పద్మ, మేరి, నారమ్మ, బుచ్చమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

చింతపల్లి: ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. చింతపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీల సమ్మెకు శనివారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించకుండా శ్రమ దోపిడీకి గురి చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, ఎంపీపీ కొండూరు భవాని పవన్‌కుమార్, సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఎంపీటీసీ సదానందం, సలీం తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం




శివాలయంలో బ్రహ్మకమలం పెట్టి పూజలు చేస్తున్న ఎస్‌ఐ

చింతపల్లి : 14 ఏళ్లకు ఒక్క సారి వికసించే పుష్పంగా.. ఎన్నో ఔషధ గుణాలనున్న పుష్పంగా పేరున్న బ్రహ్మ కమలం నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి వికసించింది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి చింతపల్లిలోని ఇంటి మేడపైన ఉన్న చెట్టుకు శుక్రవారం రాత్రి బ్రహ్మకమలం పువ్వు వికసించింది. ఆయన ఆ పుష్పాన్ని మండల కేంద్రంలో శనివారం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి తీసుకొచ్చి పూజలు చేశారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు

పెద్దవూర: ఆహారంలో చిరుధాన్యాలను చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. శనివారం పెద్దవూర మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, సుఖజీవన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

కేసీఆర్ హయాంలో తండాలకు మహర్దశ

దేవరకొండ: సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోని తండాలకు మహర్దశ లభించిందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం దేవరకొండ మండలం వెంకట్‌తండా, పాత్లావత్‌తండా(టి), కలకొండతండాల్లో బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎల్లారెడ్డిబాయి గ్రామంలో రూ.19.20లక్షలతో నిర్మించిన భగీరథ ట్యాంకు ప్రారంభించారు. రూ.5లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పద్మట్‌పల్లి, తాటికోల్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, సర్పంచ్‌లు పద్మదస్రు, గమ్లీ బాలాజీ, శ్రీనయ్య, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, నరేందర్‌రావు, రేణు గౌడ్, వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, పర్వతాలు, రుక్మారెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, జెడ్పీటీసీ మారుపాకుల అరుణ, పల్లా ప్రవీణ్‌రెడ్డి, చింతపల్లి సుభాష్, హనుమంతు వెంకటేశ్‌గౌడ్, పర్వతాలు, జూలూరు ఉత్తరమ్మ, బొడ్డు గోపాల్, సామల రవి పాల్గొన్నారు.

డీసీఎంను తప్పించబోయి ఆర్చ్‌ను ఢీకొట్టిన బస్సు

వేములపల్లి: ప్రైవేట్ ట్రావెల్ బస్సు డీసీఎం వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి ఆర్చ్‌ను ఢీకొంది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిపై చోటు చేసుకుంది. ట్రావెల్ బస్సు శుక్రవారం రాత్రి 7గంటలకు 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి గుంటూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో శెట్టిపాలేనికి వెళ్తున్న డీసీఎం వాహనం ఒక్కసారిగా ఆదిత్య మిల్లు వద్ద యూటర్న్ చేస్తుండగా బస్సు డీసీఎం వాహనాన్ని తప్పించబోయి వెనుక నుంచి స్వల్పంగా ఢీకొట్టింది. డీసీఎం రోడ్డు కిందకు దిగిపోగా.. బస్సు ఆర్చ్‌ని ఢీకొంది. బస్సులోని ప్రయాణికులకు, డీసీఎం డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (65) శనివారం మృతి చెందాడు. మిర్యాలగూడ టూ టౌన్ సీఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డుపై అనారోగ్యంతో పడి ఉండటంతో స్థానికులు గుర్తించి 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు 5.4 ఎత్తు, చామనచాయ రంగులో ఉన్నాడని తెలిపారు. సమాచారానికి 87126 70150 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

→ ఐటీఐలో ప్రవేశానికి కౌన్సిలింగ్

డిండి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో వివిధ ట్రేడ్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి 9వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 8వ తేదీలోపు https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 94412 37136 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

→ ఇంట్లోనే రిలే నిరాహార దీక్ష

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు పట్టణంలోని తన నివాసంలో శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ముందుగా ఆయన కుమారుడు బంటు జశ్వంత్ వెంకటేశ్వర్లుకు పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సాధనకు ఏడాది నుంచి వివిధ రూపాల్లో ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు.

→ రూ.73వేలు పలికిన గణేశ్ లడ్డూ

పెద్దవూర: మండల కేంద్రంలోని పీర్లకొట్టం వద్ద పదమూడు రోజులు పూజలు అందుకున్న గణేశ్ లడ్డూను గ్రామానికి చెందిన నడ్డి శంకర్ రూ.73వేలకు, రెడ్డి బజార్‌లోని గణేష్ లడ్డూ ను కర్నాటి మునిరెడ్డి రూ.56వేలకు, కలషాన్ని పల్లా శ్రీనివాస్‌రెడ్డి రూ.26వేలకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం డీజే చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

→ మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలి

దేవరకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని టీయూడబ్ల్యూజే దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు గాదె గిరిధర్‌రావు అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2న టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వాలు మీడియా కమిషన్ ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

→ పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

హాలియా: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం హాలియా మున్సిపాలిటీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కందిమల్ల వీరారెడ్డి, మేనేజర్ ఎంఏ రషీద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

→ చేపూరులో మట్టి సేకరణ

గుర్రంపోడు: మండలంలోని చేపూరు గ్రామంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్వాతంత్య్ర సమరయోధుడు వలిశెట్టి జానకి రామయ్య ఇంటి వద్ద మట్టిని సేకరించారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది కృష్ణయ్య, విజయకుమారి, నీలయ్య, రాజు, రవీంద్రాచారి, జానయ్య పాల్గొన్నారు.

→ రేషన్ పంపిణీలో పారదర్శకతకే ఈకేవైసీ

పెద్దవూర: రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈకేవైసీకి శ్రీకారం చుట్టినట్లు డీటీసీఎస్ ఎండీ.ముక్తార్ తెలిపారు. శనివారం పెద్దవూర మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఈకేవైసీ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలల్లోనూ ఈకేవైసీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలోజీ, డీలర్ బొడ్డు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

→ దొండవారిగూడెం గ్రామ కమిటీ ఎన్నిక

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ మాదిగ హక్కుల దండోర ఆధ్వర్యంలో శనివారం మిర్యాలగూడ మండలం దొండవారిగూడెం గ్రామ నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మొండికత్తి లింగయ్య ప్రకటించారు. గ్రామ అధ్యక్షుడిగా పరికల పెద్ద సైదులు, కార్యదర్శిగా పోలేపల్లి కొండల్, ప్రధాన కార్యదర్శిగా తరి వినోద్, ఉపాధ్యక్షుడిగా దోరెపల్లి లక్ష్మయ్యలను నియమించారు. కార్యక్రమంలో సంఘం మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు సైదులు, తిరుమల, చంద్రయ్య, శ్రీను, వెంకన్న, చందు, జానయ్య తదితరులున్నారు.

→ ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రశాంత్‌కుమార్

మిర్యాలగూడ: ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడిగా చందాల ప్రశాంత్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈమేరకు శనివారం ఆయనకు పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు.

→ దడవాయిలను నాల్గొవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

హాలియా: మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న దడవాయిలను నాల్గొవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని జిల్లా దడవాయి సంఘం నేతలు కోరారు. ఈమేరకు శనివారం జాయింట్ డైరెక్టర్ మల్లేశంను వరంగల్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వారిలో నల్లగొండ జిల్లా దడవాయి సంఘం నాయకులు చాపల వెంకన్న, పాదిల వెంకన్న, అంజిరెడ్డి, రమేష్, రావులపాటి వెంకన్న, కాసీం తదితరులున్నారు.

రజకుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

- ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



ధోబీఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: రజకుల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ప్రజారోగ్యశాఖ ద్వారా మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డ 3వ వార్డులో రూ.2కోట్లతో ఆధునిక ధోబీఘాట్ నిర్మాణ పనులకు శనివారం మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రజకులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగారన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు, నాయకులు బాసాని గిరి, బంటు రమేష్, ఉదయ్‌భాస్కర్, అమృతం సత్యం, కందగట్ల అశోక్, మన్నెం లింగారెడ్డి, గౌంగటి సైదిరెడ్డి, మెరుగు సంజయ్, మున్సిపల్ డీఈ సాయిలక్ష్మి, సంజీవ్‌రెడ్డి, షేక్ నాగుల్‌బాబా, నగేష్, మహమూద్, గౌస్, చారి, మణికంఠ పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను పార్టీ ఎల్లవేళలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నక్క వెంకటయ్య ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ చలికంటి యాదగిరి, ఎంపీటీసీ పాచునాయక్, పోలగాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలం

- సాగర్ ఎమ్మెల్యే భగత్



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే భగత్

హాలియా: బీఆర్ఎస్‌కు కార్యకర్తలే బలమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శనివారం హాలియా పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో గుర్రంపోడు మండలంలోని కొప్పోలు, తానేదార్‌పల్లి, పల్లెపాడు, మైలాపురం, జిన్నాయిచింత, వెలమోనిగూడెం, కొత్తలాపురం గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని సంక్షేమంతో పాటు అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గుర్రంపోడు ఎంపీపీ మంచికంటి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ వజ్జ ధనుంజయ, మండల అధ్యక్షుడు గజ్జల చెన్నారెడ్డి, ఫాక్స్ చైర్మన్ ఆవుల వెంకన్న, రాష్ట్ర నాయకులు పోలేని ముత్యాలు, దైద శ్రీనివాస్‌రెడ్డి, ఐతగోని కృష్ణగౌడ్, అంజయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కరెంట్ కోతలతో పొలాలు ఎండుతున్నాయి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



విద్యుత్ శాఖ డీఈతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: పంట పొలాలకు 24గంటల కరెంట్ అందడం లేదని, ఫలితంగా పొలాలు ఎండిపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం రాత్రి విద్యుత్ శాఖ డీఈ వెంకటేశ్వర్లును కలిసి సమస్యలు వివరించారు. కరెంట్ అందిస్తున్నామని ప్రభుత్వం, అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు కావడంలేదని అన్నారు. లోవోల్టేజ్ కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని, రైతులకు అదనపు ఖర్చులు అవుతున్నాయని తెలిపారు. కరెంట్ కోతలను నివారించి నిరంతరంగా విద్యుత్ అందించాలని, లేకుంటే రైతులను, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు రవి నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పోలేబోయిన వరలక్ష్మి, పాల్వాయి రాంరెడ్డి, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందించాలి



ఉట్లపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ: పంట పొలాలకు ప్రభుత్వం 24గంటల ఉచిత విద్యుత్‌ను అందించాలని శనివారం మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లి సబ్‌స్టేషన్ ఎదుట రైతు సంఘం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడింగ్ బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత పది రోజుల నుంచి సాగుకు కేవలం 12గంటల కరెంట్ ఇస్తుండడంతో పొలాలు ఎండిపోతున్నాయన్నారు. కరెంట్ మాటిమాటికి పోతుండడంతో మోటార్లు కాలిపోతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి సాగుకు 24గంటల విద్యుత్‌ను అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రాములుగౌడ్, కొంపెల్లి శేఖర్, కృష్ణ, సైదులు, గిరి, నగేష్, ఖాజా, వెంకన్న, లింగయ్య, రాములు, వెంకన్న, అచ్చాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హాలియా: సిద్దిపేటలో ఈనెల 24న నిర్వహించిన జాతీయస్థాయి షాడోఖాన్ కరాటే టీహెచ్‌ఆర్ కప్–2023 పోటీల్లో స్థానిక కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరాటే మాస్టర్ సైదులు శనివారం తెలిపారు. విద్యార్థులు షాన్విక, లక్ష్మి వాగ్దేవి, హిమవంత్ ప్రథమ బహుమతి సాధించి బంగారు పతకాలు పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ లక్ష్మారెడ్డి, స్కూల్ అడ్మిన్ ఇన్‌చార్జ్ సతీష్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ ప్రభాకర్ అభినందించారు.